JETIR.ORG ISSN: 2349-5162 | ESTD Year : 2014 | Monthly Issue
JOURNAL OF EMERGING TECHNOLOGIES AND INNOVATIVE RESEARCH (JETIR)
An International Scholarly Open Access, Peer-reviewed, Refereed Journal

విలక్షణ విమర్శకుడుగా గోపి

ఆధునిక తెలుగు సాహిత్య విమర్శలో డా. ఎన్. గోపి అధ్యయన దృక్పథం - విశ్లేషణ

డా. బి. బాలకృష్ణ
తెలుగు అధ్యాపకులు, తెలుగు శాఖ,
రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం - బాసర, తెలంగాణ, భారతదేశం.

Abstract (వ్యాస సారాంశం) : ఆధునిక తెలుగు సాహిత్యంలో బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరొందిన డా. ఎన్. గోపి కవిగా, పరిశోధకుడిగా మాత్రమే కాకుండా విలక్షణ విమర్శకుడిగా కూడా తనదైన ముద్ర వేశారు. భారతీయ, పాశ్చాత్య విమర్శనా సూత్రాల నేపథ్యంలో ఎన్. గోపి రచించిన 'నిలువెత్తు తెలుగు సంతకం - సినారె వ్యక్తిత్వం' (1992), 'గవాక్షం' (1995), 'సాలోచన' (1998), 'వ్యాసకలశం' (2012) వంటి విమర్శనా గ్రంథాలలోని వస్తు వైవిధ్యం, విశ్లేషణా శైలి మరియు సహృదయ దృక్పథాన్ని పరిశీలించడం ఈ పరిశోధన వ్యాస ముఖ్యోద్దేశం. విశ్లేషణాత్మక మరియు తులనాత్మక పరిశోధన పద్ధతుల ద్వారా ప్రాచీన సాహిత్యం నుండి ఆధునిక వచన కవిత్వం, స్త్రీవాదం, కథానిక మరియు పీఠికా రచనల వరకు గోపి చేసిన నిష్పక్షపాత వివేచనను ఇందులో సోదాహరణంగా విశ్లేషించడం జరిగింది.

Index Terms (కీలక పదాలు) - సాహిత్య విమర్శ, ఎన్. గోపి, సహృదయత, నిలువెత్తు తెలుగు సంతకం, గవాక్షం, సాలోచన, వ్యాసకలశం, పీఠికా సాహిత్యం.

1. ఉపోద్ఘాతం - సాహిత్య విమర్శ స్వరూపం

20వ శతాబ్ది ప్రారంభంలో విమర్శ ఒక స్వతంత్ర సాహిత్య ప్రక్రియగా భారతీయ సాహిత్యంలో వికసించింది. విమర్శకు సంబంధించి భారతీయ, పాశ్చాత్య దృక్పథాలు భిన్నమైనవి. 'విమర్శ' అన్న పదం 'మృశ్' ధాతువునకు 'వి' అనే ఉపసర్గ చేరడం వలన ఏర్పడింది. ఈ ధాతువుకు పరిశీలించడం, ఆలోచించడం, పరామర్శించడం, వెదుకడం అన్న అర్థాలున్నాయి. ప్రాచీన భారతీయ అలంకారికులు సాహిత్యపరంగా 'విమర్శ' అన్న పదాన్ని నేరుగా ప్రయోగించకపోయినా, తాంత్రిక వాఙ్మయంలోను, శ్రీ లలితా సహస్రనామంలోను ('ఓం విమర్శ రూపిణ్యై నమః'), కామకళావిలాసంలోను, తంత్రాలోకంలోను ఈ పదం కనిపిస్తుంది. కోవెల సంపత్కుమారాచార్య పేర్కొన్నట్లు "విమర్శ అంటే వాచకమైన శబ్దము. అదియే దేవికి రూపము నిరూపకము" (ఆధునిక

సాహిత్య విమర్శ - సాంప్రదాయిక రీతి, పుట. 1). ప్రాచీన సాహిత్యంలో విమర్శ భాష్యంగా, టీకగా, వ్యాఖ్యాన రూపాలుగా, అలంకార శాస్త్ర, కావ్యమీమాంస గ్రంథాలుగా 'ఆలోకం', 'వివేకం' అన్న నామాలతో వ్యక్తమైంది.

కావ్య వ్యాఖ్యాతలలో మల్లినాథసూరి ప్రసిద్ధుడు కాగా, తెలుగులో సోమనాథుడు వసుచరిత్రకు వ్యాఖ్యానం రచించాడు. ఆధునిక యుగంలో వేదం వేంకటరాయశాస్త్రి, తాపీ ధర్మారావు, శేషాద్రిరమణకవులు ఆ మార్గంలో పయనించారు. భారతీయ సంప్రదాయంలో విమర్శకుడికి 'సహృదయుడు' అని పేరు. కవి వ్యాపారం నిర్మాణాత్మకమైతే, సహృదయుని వ్యాపారం విచారాత్మకం. వాల్మీకి రామాయణావతారికలోనే విమర్శ ధోరణులకు బీజావాపనం జరిగింది. ఆ తర్వాత వామనుడు రీతిని, ఆనందవర్ధనుడు ధ్వనిని, కుంతకుడు వక్రోక్తిని, క్షేమేంద్రుడు ఔచిత్యాన్ని కావ్యాత్మలుగా ప్రతిపాదించి సమగ్ర సాహిత్య తత్త్వాన్ని ఆవిష్కరించారు.

పాశ్చాత్య విమర్శకుడు డబ్ల్యూ.హెచ్. హడ్సన్ విమర్శకు వ్యాఖ్యానం (Interpretation), నిర్ణయం (Judgment) అనే రెండు ప్రధాన విధులున్నాయని పేర్కొన్నాడు. ఐ.ఏ. రిచర్డ్స్ అనుభవాలను వివేచించి విలువకట్టే ప్రయత్నమే విమర్శ అన్నాడు. కె.వి.ఆర్. నరసింహం “ఒక గ్రంథాన్ని గైకొని అందలి లోపాలోపములను, ఔచిత్యానౌచిత్యములను... సర్వవిషయములను కూలంకషముగా చర్చించి వాఙ్మయమున ఆ గ్రంథమునకు గల స్థానమును నిరూపించుటయే విమర్శ అనబడును” (సాహిత్యదర్శనము, పుట. 20) అని నిర్వచించారు. సాహిత్యమే విమర్శకు పునాది. సారవంతమైన సాహిత్యాన్ని ఆస్వాదించి, గుణదోషాలను నిష్పక్షపాతంగా వివేచించే సహృదయుడు స్వయంగా కవి కూడా అయితే ఆ విమర్శకు ఒక విలక్షణత ఏర్పడుతుంది. అటువంటి విలక్షణ విమర్శకుడే డా. ఎన్. గోపి.

2. విమర్శకుడి లక్షణాలు - ఎన్. గోపి విమర్శ గ్రంథాలు

'గోపి సాహిత్య వస్తురూప వివేచన' గ్రంథం ప్రకారం విమర్శకుడికి మూడు ప్రధాన లక్షణాలు ఉండాలి: (1) వ్యాఖ్యానం, కథ, పాత్ర, సన్నివేశ రసంలో విమర్శకుడి అనుభూతి ఉండాలి; (2) రచన పుట్టిన కాలం, ప్రాంతం, అక్కడి మత, సంస్కృతులు తెలిసి ఉండాలి; (3) సాధారణ పాఠకుడికి దొరకని వాస్తవాలను ఎత్తి చూపించగలగాలి. కావ్యం హృదయస్పందనలకు చెందిన ప్రక్రియ కాగా, విమర్శ మేధస్సు, విశ్లేషణలకు సంబంధించింది. విమర్శకుడు కవిని హెచ్చరిస్తూ, పెడత్రోవ పట్టకుండా ప్రోత్సహిస్తూ ముందుకు నడిపించాలి.

డా. ఎన్. గోపి విశిష్ట అధ్యయనం వల్ల కవిగానే కాక, విమర్శకుడిగా కూడా ఐదు విమర్శక వ్యాస సంపుటాలను వెలువరించారు: 1. నిలువెత్తు తెలుగు సంతకం - సినారె వ్యక్తిత్వం (1992), 2. గవాక్షం (1995), 3. సాలోచన (1998), 4. వ్యాసకలశం (2012), 5. వ్యాసజిజ్ఞాస (2016). ఈ గ్రంథాలలోని విమర్శనా లోతులను పరిశీలించినట్లయితే గోపి విమర్శనా వైదుష్యం స్పష్టమవుతుంది.

3. ఎన్. గోపి విమర్శనా గ్రంథాల సమగ్ర విశ్లేషణ

3.1 నిలువెత్తు తెలుగు సంతకం - సినారె వ్యక్తిత్వం (1992)

డా. సి. నారాయణరెడ్డి షష్టిపూర్తి సందర్భంగా గోపి ఈ గ్రంథాన్ని కానుకగా సమర్పించారు. హృదయభారతి సాహితీ సాంస్కృతిక వేదిక వారి తొలి ప్రచురణ అయిన ఈ పుస్తకంలో 9 వ్యాసాలున్నాయి. ఇందులో మొదటి వ్యాసం 'సమన్వయ దృక్పథం - సినారె'. సినారె తన సిద్ధాంత గ్రంథం 'ఆధునికాంధ్ర కవిత్వము: సంప్రదాయములు - ప్రయోగములు'లో 1950-60 దశాబ్ది కవిత్వాన్ని సమీక్షిస్తూ "సంప్రదాయమును నిరసించుటగాని, అతి నవ్యకవితా ప్రయోగములు చేయుట గాని లేక కొత్తపాతల మేలికలయిక నవలంబించినట్లు తోచును" (నిలువెత్తు తెలుగు సంతకం, పుట. 1) అని 'సమన్వయ మార్గం' అనే పదాన్ని ప్రయోగించారు. జాతీయ క్షేత్రంలో నెహ్రూ చూపిన సమన్వయ మార్గం నాటి కవులను ఆకర్షించిందని సినారె ప్రతిపాదించిన తీరును, ఆయన వ్యక్తిత్వంలోని సమన్వయ దృక్పథాన్ని గోపి ఇందులో వాస్తవికంగా విశ్లేషించారు.

3.2 గవాక్షం (1995) - బహుముఖ సాహిత్య వివేచన

'గవాక్షం' గ్రంథానికి ముందుమాట రాస్తూ ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి "కవిగా, పరిశోధకుడుగా, ఉపాధ్యాయుడుగా ప్రసిద్ధుడైన గోపి, విమర్శకుడుగా కూడా తన అధ్యయన శీలాన్ని, లోతునూ నిరూపించుకున్న గ్రంథం ఇది" (కొత్త గవాక్షం ముందుమాట, పుట. 1) అని ప్రశంసించారు. ఈ సంపుటిలో 8 విలువైన వ్యాసాలున్నాయి:

మొదటి వ్యాసం 'జాషువా ప్రతిఘటన చైతన్యం'లో, అవమానాలను ధిక్కరిస్తూ స్వీయ అనుభవాల నుండి కవిత్వం రాసిన జాషువా జీవితం, కవిత్వం ఒకటేనని గోపి నిరూపించారు. 'గబ్బిలం' కావ్యం ఒక ప్రతిఘటన కంఠాన్ని కలిగి ఉండి, సమాజంలోని ఏ వర్గాన్ని నొప్పించకుండా అందరిలో ఆలోచన కలిగించిందని, ఇది ఆయన ఆరోగ్యకర చైతన్యస్థాయికి నిదర్శనమని విశ్లేషించారు. రెండవ వ్యాసం 'చలం కవిత్వం'లో, 1956లో వజీర్ రెహమాన్ ప్రచురించిన 'కవిగా చలం' పుస్తకం ఆధారంగా చలం ప్రేమలేఖలు, మ్యూజింగ్స్, అరుణ, అమీనా రచనల్లోని భావుకతను పరిశీలించి చలాన్ని 'భావకవి'గా గుర్తించారు. వేణు సంకోజు అన్నట్లు సామాజిక తత్త్వవేత్తగా లోకం చూస్తున్న చలంలోని కవిని తెరిచి చూపడం గోపి చేసిన సాహసం.

మూడవ వ్యాసం 'భావకవిగా విశ్వనాథ'లో, విశ్వనాథ సత్యనారాయణ రచనలైన 'పక్షినయ్యేద', 'మల్లిక' వంటి ఖండికలలో భావకవిత్వ లక్షణాలున్నప్పటికీ, సంప్రదాయాభిమాని మరియు బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన విశ్వనాథకు భావకవిత్వ పరిధి చాలలేదని విశ్లేషించారు. విశ్వనాథను ఒక మహాయాత్రికుడితో పోలుస్తూ "దారిలో ఓ పూలతోటలో కాసేపు విశ్రమించి... ఆ పూలతోటలో కొంత భాగాన్ని తన వెంట తీసుకెళ్లారు" (గవాక్షం, పుట. 27-28) అని కవితాత్మకంగా వ్యాఖ్యానించారు. నాలుగవ వ్యాసం 'తెలుగులో ఆధునిక కవితాత్మక వచనం'లో, శాస్త్రగ్రంథాల రచనలో

అలంకారికత ఉండకూడదని, వస్తువు పట్ల స్పష్టత ఉన్నప్పుడే నిబద్ధతతో కూడిన వచనం వస్తుందని విశ్వనాథ, శ్రీశ్రీ, సినారెల రచనలను ఉదాహరిస్తూ వివరించారు.

ఐదవ వ్యాసం 'భారతీయ భక్తి ఉద్యమ నేపథ్యంలో తెలుగు శతకాలు' (క్రీ.శ. 12-18 శతాబ్దాలు)లో భక్తి నిర్వచనాన్ని, కులభేదాలను వ్యతిరేకించిన ఆళ్వార్లు, నయనార్లు మరియు నిమ్నకులాల భక్తకవుల సామాజిక పాత్రను చర్చించారు. ఆరవ వ్యాసం 'అమలిన శృంగార సిద్ధాంతం - ఒక అనురాగ సమస్య'లో, నాటి సాంఘిక పరిస్థితుల్లో వర్ణభేదాలు, స్త్రీ విద్య ప్రారంభ దశలో తల్లిదండ్రుల అభద్రతా భావం నేపథ్యంలో భగ్నప్రేమలు నైరాశ్యానికి దారితీయకుండా రాయప్రోలు సుబ్బారావు అమలిన శృంగార సిద్ధాంతాన్ని ఒక ముందుజాగ్రత్తగా, ఆరోగ్యకర దృష్టితో మలిచారని సమర్థించారు. ఏడవ వ్యాసం 'తెలుగు కవిత - గాంధీయ ప్రభావం'లో గాంధీజీపై వచ్చిన కవిత్వాన్ని స్తుతి, స్మృతి, కస్తూర్బా స్మృతిగాను; గాంధీ తత్త్వప్రభావాన్ని అహింస, శాంతి, గ్రామస్వరాజ్యం, హిందూ-ముస్లిం ఐక్యతగాను వర్గీకరించి, తుమ్మల సీతారామమూర్తిని గాంధీ ఆస్థాన కవిగా వివరించారు. ఎనిమిదవ వ్యాసం 'కవిత - 92 - వస్తు వైవిధ్యం'లో 1992లో వచ్చిన కవిత్వాన్ని విప్లవ కవిత్వం, స్త్రీవాదం, సామాజిక వేదన, పరాయీకరణ, ప్రముఖ సంఘటనల ప్రతిస్పందన, సీనియర్ కవుల యాత్ర, తిట్టు కవిత్వం, పద్య కవిత్వం అనే ఎనిమిది ధోరణులుగా విభజించి సంయమనంతో సమీక్షించారు.

3.3 సాలోచన (గోపి పీఠికలు - 1998) - ముందుమాటల పరిశోధనాత్మకత

గ్రంథంలో చర్చించడానికి వీలుపడని, పాఠకునికి తెలియవలసిన నేపథ్య విషయాలను పరిచయం చేసే ప్రక్రియ పీఠిక. ఎన్. గోపి 50వ జన్మదిన సందర్భంగా డా. ఎండ్లూరి సుధాకర్ సంపాదకత్వంలో గోపి వివిధ గ్రంథాలకు రాసిన 50 పీఠికలను 'సాలోచన' పేరుతో ప్రచురించారు. ఇందులో 23 కవిత్వంపై, 23 పరిశోధనలపై, 4 ఇతర గ్రంథాలపై రాసిన పీఠికలున్నాయి. కల్లూరి భాస్కర్ పేర్కొన్నట్లు గోపిలో కవి, పరిశోధకుడు, అధ్యయనశీలి ఉండటం వల్ల ఆయన వచనానికి బరువూ, లోతూ సిద్ధించాయి.

ఈ సంపుటిలోని 'తంగెడుపూలు' స్వీయ పీఠికలో తన తొలి సంపుటిలోని లోపాలను సైతం నిజాయితీగా అంగీకరించారు. దీవి సుబ్బారావు 'వైశాఖ సముద్రం' పీఠికలో ఆయన కవితలను జ్ఞాపకాలు, ఆరాటం, తాత్త్వికరేఖలుగా వర్గీకరించారు. సినారె 'ప్రపంచపదులు'కు రాసిన 'పంచపదుల్లో ప్రపంచం' పీఠికలో రుబాయీ, అనుష్టుప్, హైకూ ఛందస్సులతో పోలుస్తూ "ఛందస్సు పంచపదీయం, వస్తువేమో ప్రపంచదీయం" (సాలోచన, పుట. 11) అని విశ్లేషించారు. అలాగే మోహన్ సింగ్ 'ఆశాలయం', జి. రామశేషయ్య 'అక్షరాపతాకం', ద్వానా శాస్త్రి 'ద్వానా కవితలు', ఎండ్లూరి సుధాకర్ 'వర్తమానం' పీఠికలలో ఆయా కవుల సామాజిక దృక్పథాలను ఆవిష్కరించారు.

పరిశోధన పీఠికలలో తన స్వీయ సిద్ధాంత గ్రంథం 'ప్రజాకవి వేమన' (1980)కు రాసిన 'మనసులోని మాటలు'లో వేమన ఆశుకవితా సంప్రదాయాన్ని, 70కి పైగా అముద్రిత ప్రతుల వివరాలను, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ కృషిని స్మరించుకున్నారు. డా. సంగయ్య పీహెచ్.డి. గ్రంథం 'ఆరుద్ర జీవితం, రచనలు - సమగ్ర పరిశీలన'కు రాసిన

'వైశ్లేషిక' పీఠికలో ఆరుద్ర సాహిత్యంపై పరిశోధన చేయడాన్ని సముద్రంలో ఈతతో పోల్చి, సంగయ్య కృషిని గ్లాసులో సముద్రాన్ని బంధించడంగా ప్రశంసించారు.

3.4 వ్యాసకలశం (2012) - సాహిత్య, సామాజిక, భాషా వివేచన

2012లో వెలువడిన 'వ్యాసకలశం'లో 15 వైవిధ్యభరితమైన వ్యాసాలున్నాయి. మొదటి వ్యాసం 'పుట్టిన ఊరును మాట్లాడించిన మట్టిబిడ్డ సినారె'లో, సినారె 'తొలినుడుగు', 'మలినుడుగు' గ్రంథాల ఆధారంగా తెలంగాణ, కోస్తా మాండలికాల భేదాలను, 'మూడు + పొద్దులు = మూడొద్దులు' వంటి పదాలలోని వర్ణ సమీకరణ (Assimilation) సూత్రాలను వివరించారు. రెండవ వ్యాసం 'బతుకమ్మలో జీవిస్తున్న నక్క ఆండాళమ్మ'లో 1951 ఆగస్టు 15న హత్యకు గురైన తన అక్క ఆండాళమ్మ విషాద గాథను, బల్ల గౌతమయ్య రాసిన బతుకమ్మ ఉయ్యాలపాటను, ఆరుద్ర, చెర్వీరాల భాగయ్య ప్రస్తావనలను హృదయవిదారకంగా నిక్షిప్తం చేశారు.

మూడవ వ్యాసం 'జీవితాన్ని ఉన్నతీకరించిన కవి పాపినేని శివశంకర్'లో 'స్తబ్ధత చలనం', 'ఒక సారాంశం కోసం' సంపుటాలలోని పరాయీకరణ, శ్రామిక పక్షపాతాలను; నాలుగవ వ్యాసం 'గుజరాత్లో తెలుగు సాహితీయాత్ర'లో 'జలగీతం' గుజరాతీ అనువాదం 'జఢగీత్'కు లభించిన సాహిత్య అకాడమీ పురస్కార అనుభవాలను, ఇతర భాషా రచయితల భాషాభిమానాన్ని వివరించారు. ఐదవ వ్యాసం 'ఓల్గా ఒక మగ్న'లో 'నీలిమేఘాలు' సంకలనాన్ని స్త్రీవాద సాహిత్యంలో 'అప్లైడ్ మ్యానిఫెస్టో'గా పేర్కొంటూ, స్త్రీని ఒక మానవ స్త్రీగా గుర్తించాలన్న ఓల్గా వాదనను ప్రశంసించారు. ఆరవ వ్యాసం 'సహృదయుడంటే ఎవరు?'లో రాజశేఖరుడి భావయిత్రి-కారయిత్రి శక్తులను, ఆనందవర్ధనుడి నిర్వచనాన్ని ఉటంకిస్తూ సహృదయత ప్రాధాన్యతను చాటారు.

ఏడవ వ్యాసం 'జీవితాన్ని ఆర్ద్రీకరించిన కవయిత్రి దివాకర్ల రాజేశ్వరి'లో 'భూమి తడిపిన ఆకాశం' సంపుటిలోని మధ్యతరగతి మహిళ అంతరంగ మథనాన్ని; ఎనిమిదవ వ్యాసం 'సామాజికకవి యోగివేమన'లో మరియు పదవ వ్యాసం 'ప్రజాయోగులు వేమన - శ్రీ నారాయణ గురు'లో వేమన, కేరళ సంఘసంస్కర్త నారాయణ గురుల కులనిర్మూలన, హేతువాద తులనాత్మక అంశాలను విశ్లేషించారు. తొమ్మిదవ వ్యాసం 'పాత్రికేయుని విద్యారంగ విహారం'లో ఎం.వి.ఆర్. శాస్త్రి 'మన చదువులు' ఆధారంగా మెకాలే విద్యావిధానం, ఆంగ్ల భాషా ఆధిపత్యం, విద్య వ్యాపారీకరణను విమర్శించారు. పదకొండవ వ్యాసం 'సాహిత్యమూ సందర్భమూ'లో భరతుడు, ధనంజయుల అలంకార శాస్త్ర సిద్ధాంతాల ప్రకారం వస్తు, ఇతివృత్త, రూప పరిణామాలను వివరించారు.

పన్నెండవ వ్యాసం 'రాళ్ళబండి కవిత్వంలో రత్నాలు'లో రాళ్లబండి కవితాప్రసాద్ అవధాన, సైంటిఫిక్ పోయెట్రీ ప్రయోగాలను; పదమూడవ వ్యాసం 'హిందీ అనువాద పితామహుడు బాలశౌరిరెడ్డి'లో 225 తెలుగు కథలు, పలు నవలలను హిందీలోకి అనువదించి దక్షిణ భారత సాహిత్యాన్ని ఉత్తరాదికి పరిచయం చేసిన 'ద్విభాషీ' బాలశౌరిరెడ్డి సేవలను కొనియాడారు. పద్నాలుగవ వ్యాసం 'రచయితలకు రచయిత సి. రామచంద్రరావు'లో 'వేలుపిళ్లై' కథా సంపుటిలోని మానవ స్వభావ సంక్లిష్టతను, టీ ఎస్టేట్ జీవిత చిత్రణను విశ్లేషించారు. చివరిదైన పదిహేనవ వ్యాసం 'మనిషిని ప్రేమించే మంచి కవి రామాచంద్రమౌళి'లో 'అంతర్ధానం', 'ఒక దేహం - అనేక మరణాలు'

సంపుటాలలోని అజంజాహి మిల్లు మూత విషాదాన్ని, రామాచంద్రమౌళి వక్తృత్వ శైలిని ఆవిష్కరించారు.

4. ముగింపు (Conclusion)

సమగ్ర పరిశీలన ద్వారా డా. ఎన్. గోపి ఆధునిక తెలుగు సాహిత్య విమర్శలో ఒక విలక్షణమైన మార్గాన్ని నిర్మించుకున్నారని స్పష్టమవుతోంది. ప్రాచీన అలంకార శాస్త్ర పరిజ్ఞానం, భాషాశాస్త్ర అవగాహన, సామాజిక స్పృహ మరియు స్వయంగా కవి కావడం వల్ల కలిగిన సహృదయత ఆయన విమర్శకు బలమైన పునాదులుగా నిలిచాయి. 'నిలువెత్తు తెలుగు సంతకం' నుండి 'వ్యాసకలశం', 'వ్యాసజిజ్ఞాస' వరకు ఆయన చేసిన విమర్శనా ప్రస్థానంలో ఎక్కడా కటుత్వం లేదా పక్షపాతం కనిపించదు. సమకాలీన కవులను, నూతన ప్రక్రియలను ప్రోత్సహిస్తూనే, సాహిత్య విలువలకు కట్టుబడి నిష్పక్షపాత విశ్లేషణ చేయడం గోపి విమర్శలోని విశిష్టత. తెలుగు సాహిత్య విమర్శను సామాన్య పాఠకులకు చేరువ చేస్తూ, భావి పరిశోధకులకు మార్గదర్శకంగా నిలిచిన విలక్షణ విమర్శకుడు డా. ఎన్. గోపి.

5. ఉపయుక్త గ్రంథసూచి (References)

[1] గోపి, ఎన్. (1992). నిలువెత్తు తెలుగు సంతకం - సినారె వ్యక్తిత్వం. హృదయభారతి సాహితీ సాంస్కృతిక వేదిక, హైదరాబాద్.

[2] గోపి, ఎన్. (1995). గవాక్షం (సాహిత్య విమర్శ వ్యాసాలు). చైతన్య ప్రచురణలు, హైదరాబాద్.

[3] గోపి, ఎన్. (1998). సాలోచన (గోపి పీఠికలు) (సంపా. ఎండ్లూరి సుధాకర్). హైదరాబాద్.

[4] గోపి, ఎన్. (2012). వ్యాసకలశం. ఆనంద్ బుక్స్, హైదరాబాద్.

[5] గోపి, ఎన్. (2016). వ్యాసజిజ్ఞాస. ఆనంద్ బుక్స్, హైదరాబాద్.

[6] చంద్రశేఖర రెడ్డి, డి. (1990). తెలుగు పీఠిక. ఆంధ్ర సారస్వత పరిషత్తు, హైదరాబాద్.

[7] నరసింహం, కె.వి.ఆర్. (1975). సాహిత్యదర్శనము. విశాఖపట్నం.

[8] రఘు, ఎస్. (సంపా.). (2008). గోపి సాహిత్య వివేచన. హైదరాబాద్.

[9] రాములు, పిల్లలమర్రి. (2002). తెలుగులో భక్తి కవిత్వం - సామాజిక విశ్లేషణ. హైదరాబాద్.

[10] సంపత్కుమారాచార్య, కోవెల. (1985). ఆధునిక సాహిత్య విమర్శ - సాంప్రదాయిక రీతి. వరంగల్.

[11] Hudson, W. H. An Introduction to the Study of Literature. George G. Harrap & Co., London.

[12] Richards, I. A. Principles of Literary Criticism. Routledge & Kegan Paul, London.